క్లుప్తంగా

పంట కోత ప్రయోగంపై శిక్షణ



నకరికల్లు: పంట కోత ప్రయోగం ద్వారా ఆహార ఉత్పత్తుల దిగుబడి అంచనా వేయొచ్చని ఏఎస్‌ఓ కె.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శుక్రవారం శిక్షణనిచ్చారు. ఆయన మాట్లాడుతూ గణాంకాల శాఖ జారీ చేసిన క్రమ సంఖ్య ప్రకారం సాగు చేస్తున్న పంటలను గుర్తించి, క్రమ పద్ధతిలో పంట కోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల సిబ్బంది, వీఆర్వోలు కలసి పంట కోత ప్రయోగాలు నిర్వహించాలని సూచించారు. పంట దిగుబడులు తగ్గినప్పుడు రైతులు పంట బీమా పొందేందుకు పంటకోత ప్రయోగాలు మూలాధారమన్నారు.

ఏఐ భవిష్యత్ విప్లవం



సత్తెనపల్లి: భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో విప్లవాత్మకం కానుందని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ కె.హేమంత్ కుమార్‌రెడ్డి (సీఎస్ఈ), డాక్టర్ ఎం.దుర్గాప్రకాష్ (ఈసీఈ) అన్నారు. మండలంలోని కంటిపూడి సమీపంలోని వరప్రసాద్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు శుక్రవారం 'టెక్ ఆఫ్ ది ఎరా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏఐపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్, సీఎస్ఈ హెచ్‌ఓడీ ప్రొఫెసర్, పాల్సన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి 'గిడుగు' పురస్కారాలు



సత్తెనపల్లి: మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లికి చెందిన ఇద్దరికి గిడుగు వెంకట రామమూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత గురువారం మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. కళాకారుడు యూవీ రత్నం ఆధ్వర్యంలో సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి, వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌లు రంగస్థలం నుంచి పురస్కారాలు అందుకున్నారు. రవి కుమార్ హాజరు కాలేకపోవడంతో రెండు పురస్కారాలను రమాదేవి స్వీకరించారు. పురస్కార గ్రహీతలను పట్టణంలోని వివిధ కళా సంస్థల అధినేతలు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధిలో గల వీరమ్మ కాలనీలోని వృద్ధాశ్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లలు, వృద్ధులు, మహిళలకు బీపీ, షుగర్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలలో ఒకరోజు ఆశ్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎం శారద, సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, ఆశ కార్యకర్తలు సుజాత, మరియమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన

బెల్లంకొండ: కౌమార దశలో ఉన్న బాలికలు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్ఓ ఎం.ఝాన్సీ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం 'కౌమార స్నేహ పూర్వక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి, చెడు స్పర్శలను ఏ విధంగా గుర్తించాలో బాలికలకు వివరించారు. చిన్నతనం నుంచే సెల్ఫ్ ప్రొటెక్షన్ అలవర్చుకోవాలని, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వివాహ వయసు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్ఎం బలరాం నాయక్, చైర్మన్ దీపాల కోటేశ్వరరావు, ఏఎన్ఎం సాగర్ మాత, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అరుణ కుమారి, అల్లాబి, స్వాతి, ఫర్జానా, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణ విషయంలో ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. రోగి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోతే విధులు నిర్వర్తించలేం. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

– వడితె ఝాన్సీబాయి,
ఎంఎల్‌హెచ్‌పీ, వెంకటాయపాలెం, బెల్లంకొండ



వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మహిళా వైద్య సిబ్బందికి విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించాలి. తగిన రక్షణ కల్పించాలి.

– తిరుపతమ్మ,
ఎంఎల్‌హెచ్‌పీ, మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ



పల్లె 'నాడి' పట్టేదెవరు..!

- గ్రామాలను పీడిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ ఎక్కడా..?
- పల్లెకు అందని ప్రభుత్వ వైద్య సేవలు
- మంచం పట్టిన గ్రామీణులకు కనిపించని భరోసా



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న రోగులు (ఫైల్ ఫొటో

బెల్లంకొండ: సీజనల్ వ్యాధులు.. గ్రామాలను ప్రస్తుతం పట్టి పీడిస్తున్నాయి. ఏ తలుపు తట్టినా డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో ఒకరు లేదా ఇద్దరు మంచం పట్టి కనిపిస్తున్నారు. డబ్బులున్నవారు ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం పొందితే.. చేతిలో చిల్లిగవ్వలేని పేదలు మంచానికే పరిమితమై మూలుగుతున్నారు. గత ఐదేళ్లు 'మీ ఆరోగ్యానికి మాది భద్రత' అన్న రీతిలో గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వైద్య సేవలు అందించారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పల్లెల్లో ఆరోగ్యం క్షీణించింది. ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు లేవు. రోగంతో మంచం పట్టిన వారిని పట్టించుకునే నాథుడే లేడు. అటు డయేరియా.. ఇటు సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నా.. నాడి పట్టుకుని వైద్యం చేసేవారు లేక రోగులు అల్లాడుతూ వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు.

వ్యాధులను గుర్తించే వారెవరు..?

గ్రామాల్లో క్రమం తప్పకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. మందులు ఇచ్చేవారు కరువయ్యారు. సీజనల్ జ్వరాలు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులకు గతంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్ ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసేవారు. కానీ, ఇప్పుడు వారు ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యారు. గతంలో గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు క్రమం తప్పకుండా జరిగేవి. రక్తహీనతతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించి, మందులు ఇచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని మహిళలు చెబుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు మంగళం..

ఎంతో ముందు చూపుతో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను గత ప్రభుత్వం నియమించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల పరిధిలో డాక్టరే వారి ఇళ్లకు వెళ్లి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమాన్ని నేడు పూర్తిగా విస్మరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులు ఆర్ఎంపీలు, ప్రైవేటు వైద్యశాలల బాటపడుతున్నారు.

'కంటి వెలుగు' మాయం

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి చూపుతో బాధపడే ఎంతో మందికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చికిత్స అందించి, కళ్లజోళ్లను పంపిణీ చేసింది. పాఠశాల విద్యార్థులకు కంటి సమస్యతో చదువుకు ఆటంకాలు ఉండకూడదని కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను అందించారు. అలాంటి కార్యక్రమంపై నేడు కారు చీకట్లు కమ్ముకున్నాయి. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు లేవు.



కంటి వెలుగు ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పైసా ఖర్చు ఉండేది కాదు

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక పైసా ఖర్చు లేకుండా ఉచితంగా పరీక్షలు నిర్వహించేవారు. ఈసీజీ తీయడం, అక్కడే గుండె సంబంధిత వైద్యులతో పరీక్షించి, మందులు పంపిణీ చేయడం చకచకా జరిగిపోయేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.

–బూదాటి మరియదాసు, నందిరాజుపాలెం, బెల్లంకొండ



ఆరోగ్య భరోసా కరువైంది

గతంలో గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో గ్రామీణ ప్రజలంతా ధైర్యంగా ఉండేవారు. డాక్టర్లే ఇళ్ల వద్దకు వచ్చి వైద్యం చేస్తారన్న ధైర్యం ఉండేది. ప్రస్తుతం ఆరోగ్య భరోసా కరువైంది. హెల్త్ క్యాంపుల నిర్వహణ లేకపోవడంతో చాలామంది ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందాల్సి వస్తోంది.

– బాణావతు నరసింహ నాయక్, సర్పంచ్, న్యూ చిట్యాల, బెల్లంకొండ



భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవి అమ్మవారు



మహారాష్ట్ర వీధిలో మహిళల పూజలు

సత్తెనపల్లి: శ్రావణ మాసం చివరి శుక్రవారం ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, మహారాష్ట్ర వీధిలోని భక్తాంజనేయ స్వామి దేవస్థానంతో పాటు పెద మక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, వ్రతాలు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శ్రావణ శుక్రవారం..పరమ పవిత్రం

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నార్నెపాడు గ్రామంలోని శ్రీ భీమలింగేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలోని శ్రీ బలభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి, ముప్పాళ్లలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



డీటీ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన పెన్షన్ విధానాన్ని (యుపీఎస్) రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ఏమాత్రం ఆమోద యోగ్యం కానీ నూతన పెన్షన్ విధానం ప్రతిపాదన తక్షణమే విరమించుకోవాలన్నారు. పాత పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టాలన్నారు. పని సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు పంపే ఆలోచనను విరమించి, మండల స్థాయికి పరిమితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొర్రా వెంకట్రావు, యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడు కిషోర్, సత్తెనపల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఠాగూర్, విష్ణుమూర్తి, అచ్చంపేట అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, భద్రయ్య, శేషగిరి, శ్రీనివాసరెడిడ్డ, తాజుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరం ఆరోగ్య హితం



గోళ్ళపాడు యూపీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముప్పాళ్ళ: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఆయా గ్రామాల వైద్య సిబ్బంది పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ముప్పాళ్లలో జరిగిన కార్యక్రమంలో వైద్యురాలు రమాదేవి పాల్గొని, మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల దీర్ఘకాలిక వ్యాధులతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అనంతరం ప్రధాన కూడళ్లు, పోలీస్ స్టేషన్ వద్ద పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ రూపొందించిన వాల్ పోస్టర్‌లను అతికించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి, ఏఎన్ఎంలు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషాభివృద్ధికి కృషి చేయాలి

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ జి.స్వర్ణలత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ, బడి భాష, ఇంటి భాష ఒక్కటిగా ఉండాలని వ్యవహారిక భాష ఉద్యమాన్ని నడిపిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, డాక్టర్ దీప, విద్యార్థులు పాల్గొన్నారు.

• సాగిన విద్యుత్ తీగలు

అచ్చంపేట: అచ్చంపేట నుంచి పెదపాలేనికి వెళ్లే బాట పక్కన వ్యవసాయ భూమిలోని విద్యుత్ స్తంభాలు వాలిపోతున్నాయి. విద్యుత్ తీగలు బాగా సాగి కిందకు వేలాడుతున్నాయి. రైతులు అరక దున్నే సయంలో ఎడ్లను అదిలించే ముల్లు కర్ర పైకెత్తినప్పుడు తగిలేంతగా తీగలు ఉన్నాయి. గాలులకు ఒకదానికొకటి రాసుకుని నిప్పు రవ్వలు పడుతున్నాయి. అసలే వర్షాలు, ఆపై సాగిన తీగలు.. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. విద్యుత్ సిబ్బంది సాగిన తీగలను, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సాధ్యమైనంత త్వరగా క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.



ముల్లు కర్రకు అందే ఎత్తులో సాగిన విద్యుత్ తీగలు

వనం–మనం.. మొక్క నాటిన క్షణం



మొక్కకు నీరు పోస్తున్న ఎంఈవో మల్లికార్జున శర్మ



క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న నాయకులు

క్రోసూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వనం–మనం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు మొక్క లు నాటారు. కార్యక్రమానికి హాజరైన యార్డు మా జీ చైర్మన్ కాంగ్రు కాశియ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చదనం పెరగాలన్న లక్ష్యంగా ప్రభుత్వం వనం – మనం కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ప్రజలు కూడా తమ గృహాల ఆవరణల్లో మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం పంపిణీ చేసే మొ క్కలు అన్ని గ్రామాల్లో నాటడం జరుగుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, కాంగ్రు సాంబయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామాంజనేయులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులు చిల్కా సురేష్, దుగ్గిబాబూరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

రాజుపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని మండల విద్యాశాఖాధికారి–1 బి.మల్లికార్జునశర్మ పేర్కొన్నారు. కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేంద్రబాబు, సొసైటీ అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, విద్యా కమిటీ చైర్మన్ శ్రీను బాషా, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, వైస్ చైర్మన్ లక్ష్మీ పాల్గొన్నారు.

గారపాడులో వన మహోత్సవం

పెదకూరపాడు: గారపాడు గ్రామంలో రైతు బండారుపల్లి శ్రీనివాసరావు పొలంలో శుక్రవారం వనం –మనం కార్యక్రమం నిర్వహించారు. జామ, ఇతర మొక్కలు నాటారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్, గ్రామ నాయకులు పెనుముచ్చు రమేష్ , గ్రామ పార్టీ ప్రెసిడెంట్ పొదిలి కోటేశ్వరరావు, కొండమీద శ్రీనివాసరావు, మేడ బాబు పాల్గొన్నారు.



గారపాడులో మొక్కలు నాటుతున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి పేర్కొన్నారు. వనం–మనంలో భాగంగా పట్టణంలోని వావిలాల నగర్‌లో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీతులసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. 26వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి సీతామహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు పి.బ్రహ్మచారి, పాఠశాల ఇన్‌చార్జి మాధురీలత, శానిటరీ సెక్రటరీ సునీత బాయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

- నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ ఒ.జాన్సన్, ఎస్.శైలజ, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ప్రెసిడెంట్ ఎం.రత్నబాబు, మెంబర్ కె.మరియదాసు, బి.విజయ్ కుమార్, ఎం.వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.



శిశుమందిర్‌లో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ లక్ష్మీతులసి



గురుకులంలో మొక్కలు నాటుతున్న రమాదేవి

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలో శనివారం నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో బి.మహేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సచివాలయాల పరిధిలో 8,680 మంది పింఛనుదారులకు రూ.36,97,1000లు విడుదలైనట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేస్తారని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

క్రోసూరు: మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రావ్ విగ్రహాల సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు చెందిన మతి స్థిమితం లేని మైనర్ బాలికను అత్యాచారం చేసి, రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తన పాలనలో ఆడ పిల్లలపై అఘాయిత్యం చేస్తే అదే ఆఖరి రోజు అవుతుందన్నారని, కానీ, రాష్ట్రంలో ఏదో ఒక చోట ప్రతి రోజు మహిళలపై దాడులు, హింసలు, అత్యాచారాలు చోటు చేసుకుంటుండటం విచారకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు చిలక భాస్కరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు అచ్యుతరావు, మండలాధ్యక్షుడు నాగయ్య, చిలక జాన్ ఉన్నారు.

సుబ్బయ్యపాలెంలో వైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామ పరిధిలో గల గిరిజనవాడలో శుక్రవారం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ నిమ్మల సాయిబాబు పాల్గొని వైద్యపరీక్షలు చేశారు. 83 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం 8 మంది సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎస్కే మాబుసుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రఘురాం నగర్‌లో గల శ్రీ రాఘవేంద్ర బాలు కుటీర్ పాఠశాలలో కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి భవనం నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వీవీ సుబ్బరాయుడు, అధ్యక్షుడిగా ఎస్కే మాబు సుభాని, జనరల్ సెక్రెటరీగా జి.శివ కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎన్.రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.అంజలి సుధ, ఎస్.సత్యానంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని 26 పాఠశాలలకు గాను 20 ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.